క్లుప్తంగా

పుస్తక పఠనంతో ఏకాగ్రత

శ్రీకాకుళం కల్చరల్: పుస్తక పఠనంతో ఏకాగ్రత పెరుగుతుందని తెరవే ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి అన్నారు. స్థానిక న్యూ కాలనీలోని జీన్ విజన్ లైబ్రరీ వ్యవస్థాపకుడు పత్తి సుమతి ఆధ్వర్యంలో పుస్తక పఠన దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వలన విజ్ఞానం పెరుగుతుందన్నారు. రచయిత పత్తి సుమతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఉచితంగా పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయకులు, పాఠకులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని ఖాజీపేట గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీ జరుగుతున్న ప్రాంతాన్ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం సాయంత్రం పరిశీంచారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ టోకెన్ ప్రకారం ఎరువులు తీసుకోవాలని, ఎరువుల పంపిణీలో ఏమైనా లోపాలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

నేడు ఆలయాల మూసివేత

శ్రీకాకుళం కల్చరల్: చంద్ర గ్రహణం కారణంగా నగరంలోని పలు ఆలయాలు ఆదివారం మూసివేయనున్నారు. గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయం మధ్యాహ్నం 12 గంటల నుంచి మూసివేసి, తిరిగి 8వ తేదీ ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలు కల్పిస్తామని ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి తెలిపారు. అలాగే నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయం, సంతోషిమాత ఆలయంతో పాటుగా తదితర ఆలయాలన్నీ మూసివేయడం జరుగుతుంది.

ఎస్పీని కలిసిన పాతపట్నం సీఐ



ఎస్పీ మహేశ్వరరెడ్డికి పూలమొక్క అందజేస్తున్న సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్: ఇటీవల విశాఖ రేంజి వీఆర్ నుంచి పాతపట్నం బదిలీ అయిన సీఐ ఎస్.సన్యాసినాయుడు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సరిహద్దు చెక్ పోస్టు ప్రాంతాల్లో నిత్యం గంజాయి అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర నేరస్తులపై నిఘా పెట్టాలంటూ సీఐని ఎస్పీ సూచించారు.

హోంగార్డుకు చెక్ అందజేత

శ్రీకాకుళం క్రైమ్: ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు టి.ఆదినారాయణకు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి నగదు చెక్ అందజేశారు. జిల్లా హోంగార్డుల ఒక్కరోజు వేతనం రూ.4.08 లక్షలను చెక్ రూపంలో అందించారు.

నేత్రదానంతో వెలుగులు



నేత్రదానంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం న్యూకాలనీ: నేత్రదానంతో మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా యూత్ రెడ్‌క్రాస్, కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. నేత్రదానంపై అపోహలు వీడి.. నేత్ర దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం నేత్రదానంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పీసీబీవీ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ ఎస్.పుష్పలత, ఆప్తాల్మిక్ ఆఫీసర్ వి.చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కె.వేణు, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు హరి మానస, పైడి రాజు, రెడ్‌క్రాస్ సభ్యులు జి.రమణ, పి.చైతన్య, పి.సుజాత పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రణస్థలం: గత ప్రభుత్వంలో వలంటీర్లు చేసిన పనులన్నీ ప్రస్తుతం గ్రామ సచివాలయ ఉద్యోగులతో చేయించడం సమంజసం కాదని అల్లివలస, పైడిభీమవరంతో పాటు పలు గ్రామ సచివాలయ ఉద్యోగులు అన్నారు. ఈ మేరకు నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో శనివారం నిరసన తెలిపారు. తమను ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

పుస్తకావిష్కరణ నేడు

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న నెలవారీ కార్యక్రమంలో 'ముంజూరు' పుస్తకావిష్కరణ జరుగుతుందని తెరవే ప్రధాన కార్యదర్శి ఆర్.వి.రమణమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అరటి సాగుపై ఆసక్తి

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రతిఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- తగిన జాగ్రత్తలతో అధిక దిగుబడి



కుప్పిలిలో అంతరపంటగా సాగు చేస్తున్న అరటిపంట



మురపాకలో సాగు చేస్తున్న అరటిపంట

ఎచ్చెర్ల:

భారతీయ సంస్కృతీ, సాంప్రదాయాలతో అరటి ముడిపడి ఉంది. అరటిపండు లేకుండా ఏ శుభకార్యం కూడా జరగదని చెప్పవచ్చు. అంతేకాకుండా నిత్య జీవితంలోనూ అరటి ఒక భాగమైపోయింది. అరటిపండుకు ఉన్న ఆహార, ఆరోగ్య విలువల వలన దానిని అమృత ఫలం అంటారు. ప్రతిరోజూ ఒక అరటి పండు తీసుకుంటే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు. ఇన్ని ప్రయోజనాలు ఉన్న అరటికి మంచి డిమాండ్ ఉండడంతో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని సుమారు 70 ఎకరాల్లో రైతులు అధికంగా సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

అనుకూల వాతావరణం

నీరు ఇంకిపోయే గుణం కలిగిన సారవంతమైన నేలలు అరటి సాగుకు అత్యంత అనుకూలంగా ఉంటాయి. ఉదజని సూచిక 6.5 నుంచి 7.5 ఉన్న భూములు చాలా అనుకూలం. అంతేకాకుండా అరటి ఉష్ణ మండల పంట. 10 డిగ్రీల నుంచి 40 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత వరకూ మంచి దిగుబడి వస్తుంది. అధిక చౌడు, ఆమ్లశాతం ఉన్న భూమిలో పనామ–మాడు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది.

టిష్యూ కల్చర్ మొక్కలు ఉత్తమం

టిష్యూ కల్చర్ ద్వారా ప్రవర్తనం జరిపిన అరటి మొక్కలను రైతులు నాటాలని అధికారులు సూచిస్తున్నారు. తెగుళ్లు లేని అధిక దిగుబడి, నాణ్యత కలిగిన తల్లి మొక్క నుంచి కణజాలాన్ని సేకరించి ప్రయోగశాలలో అవసరమైన వెలుతురు, గాలిలో తేమ, ఉష్ణోగ్రత లాంటి పరిస్థితులను కల్పించి కణజాలం నుంచి పిల్ల మొక్కలను ఉత్పత్తి చేసే ప్రక్రియే టిష్యూ కల్చర్. వీటికి ముఖ్యంగా వైరస్ తెగుళ్లు ఆశించే అవకాశం ఉండదు.

మొక్కలు నాటే విధానం

అరటిని ఎకరానికి 1,235 లేదా 1,280 మొక్కలను నాటాలి. గుంత నుంచి వచ్చిన మట్టికి 5 కిలోల పశువుల ఎరువు, అరకిలో వేపపిండి, 300 గ్రాములు సూపర్‌ఫాస్ఫేట్ ఎరువు, 30 గ్రాముల లిండెన్‌పొడి మందు చేర్చి బాగా కలియబెట్టి గుంత నింపి అనంతరం మొక్కను నాటాలి.

అంతర పంటలకు అనుకూలం

అరటితోట అంతర పంటలకు అనుకూలంగా ఉంటుంది. అరటి సాగులో అంతర పంటలుగా వేరుశనగ, ఆలనంద, పసుపు, అల్లం, ఉల్లి, వెల్లుల్లి, అనాస, ఆకుకూరలు, క్యారెట్, కాలీఫ్లవర్, క్యాబేజీ వేసుకుని లాభాలు సాధించవచ్చని అధికారులు సూచిస్తున్నారు. అంతేకాక దీర్ఘకాలిక పంటలైన మామిడి తోటల్లోను ఈ అరటిసాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. అయితే అంతర పంటలకు అరటితో సంబంధం లేకుండా ఎరువులు అదనంగా ఇవ్వాలి. అరటి సాగుకు ఎక్కువగా నీరు అవసరం కానీ నీరు నిల్వ ఉండకూడదు. కాబట్టి రైతులు డ్రిప్ పద్ధతిలో నీరు కట్టడం ఉత్తమం. అంతేకాక ఫర్టిగేషన్ పద్ధతిలో ఎరువులు వేస్తే అరటి చెట్లు అధిక దిగుబడులు ఇస్తాయి.

అంతర కృషి ముఖ్యం

అరటిలో తల్లి చెట్టుకు సరైన పోషకాలు అందుబాటులో ఉంచడం, బలంగా ఉంచడానికి అంతర కృషి చాలా ముఖ్యం. అందువలన అరటి పిలకలు చిన్నవిగా ఉన్నప్పుడే తల్లి చెట్టు నుంచి తొలగించాలి. అరటి చెట్టు రకాన్ని బట్టి 10 అడుగుల కన్నా ఎత్తుగా ఉన్నప్పుడు గెలవేసిన తర్వాత బరువుకు చెట్టు పడకుండా కర్రల ద్వారా ఊతం ఇవ్వాలి. గెల వేసిన తర్వాత గెల చివరన ఉండే మగపువ్వుని తుంచి వేయాలి. మగ పువ్వుని తుంచిన తర్వాత బన్స్ ఫీడింగ్ మిశ్రమం (ఆవుపేడ, ఆవుమూత్రం)ను పాలీ కవర్‌లో పెట్టి గెలకు కట్టాలి.

సస్య రక్షణ చర్యలు

కాండం తొలుచు పురుగు నివారణకు పూత రాక ముందు మోనోక్రోట్ పాస్ ఇంజక్షన్ ఇవ్వాలి. ముక్కు పురుగు దుంపలో వలయాకారపు బొరియలు చేసి దుంప కుళ్లిపోయేలా చేస్తుంది. దీని నివారణకు ఒక్కో మొక్కకు 25 గ్రాముల కార్బో ఫ్యూరాన్ గుళికలను చెట్టు మొదళ్లలో వేసి మట్టితో కప్పి నీరు పెట్టాలి. నులి పురుగులు చెట్టు వేళ్లకు ఆశిస్తే దుంప బలహీనపడి ఆకులు నల్లగా మాడి ఎండిపోతాయి. దీని నివారణకు వేపపిండి 200 గ్రాములు, 100 గ్రాముల వీఏఎం కలిపి ఒక్కో మొక్కకు వేయాలి. ఆకులపై మొట్టమొదట చిన్న పసుపు రంగు మచ్చలు ఏర్పడి, క్రమేపి వివిధ దశల్లో ఆకులు పూర్తిగా రాలిపోతాయి. దీని నివారణకు మాంకోజెట్ 2.5 గ్రాములు, క్లోరోథాలోనిల్ 2 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. పేను బంక వల్ల వైరస్ తెగుళ్లు ఆశించి మొక్కల్లో పెరుగుదల ఆగకుండా నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

మెలకువలతోనే దిగుబడి

అరటి సాగు చేసే రైతులు అధికారుల సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించగలరు. అరటి పంటను డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం ఉత్తమం. అరటిని మామిడి తోటల్లో అంతర పంటగానూ, అరటి తోటలో వివిధ పంటలను అంతర పంటలుగా సాగు చేసుకోవచ్చు.

– సుదర్శిని,
ఉద్యానవన శాఖాధికారి, ఎచ్చెర్ల

ఆదిత్యుని సన్నిధిలో న్యాయమూర్తులు



కూర్మనాథుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో నర్సునాయుడు

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని మధ్యప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విశాల్ ధగాట్, జస్టిస్ వివేక్ అగర్వాల్‌లు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సాంప్రదాయం ప్రకారం ఆలయ ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరిస్తూ గోత్రనామాలతో పూజలు చేయించారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇప్పిలి సాందీప్‌శర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో...

గార: ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథుడిని మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి విశాల్ ధగాట్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. మూల విరాట్‌కు ప్రత్యేక దర్శనం అనంతరం లక్ష్మీ సన్నిధిలో పూజలు జరిపారు. క్షేత్ర మహాత్యాన్ని ఆలయ ప్రధానార్చకులు సీహెచ్ సీతారామనృసింహాచార్యులు తెలియజేశారు. ఆలయ ఈవో కె.నర్సునాయుడు స్వామి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నర్సుబాబు, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్ర పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఆదివారం జరగనున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షల ఏర్పాట్లను శనివారం ఏపీపీఎస్సీ సభ్యుడు ఎన్.సోనీవుడ్ పరిశీలించారు. జిల్లాలోని ముఖ్యమైన మూడు కేంద్రాలైన శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీకాకుళం ఉమెన్స్ కాలేజీ, ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో ఆయా అభ్యర్థుల కోసం చేసిన ఏర్పాట్లను సమీక్షించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు రెవెన్యూ అధికారులు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



విద్యార్థినిని అభినందిస్తున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది

ఎచ్చెర్ల: విద్యార్థులు క్రీడల్లో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ అన్నారు. ఇటీవల ఏపీ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నిర్వహించిన 9వ స్టేట్ జూనియర్ ఇంటర్ జిల్లా ఛాంపియన్ షిప్‌లో, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో పీయూసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.వినూత్న తృతీయ స్థానంలో నిలిచి, త్వరలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. దీంతో ఆమెను అధ్యాపక సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఏవో ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఇన్‌చార్జి సాగర్, టి.దిలీప్‌కుమార్, కృష్ణంరాజు, పీఆర్వో మామిడి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి



5కె మారథాన్ ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో అనిత



పరుగుపందెంలో పాల్గొన్న ట్రాన్స్‌జెండర్లు

అరసవల్లి: ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరిగా ఉండాలని, జిల్లాలో ఎయిడ్స్ చాప కింద నీరులా విస్తరిస్తోందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె. అనిత తెలియజేసారు. వ్యాధిపై అవగాహన కోసం స్థానిక 80 ఫీట్ రోడ్డు కూడలి నుంచి కలెక్టరేట్ వరకు యూత్ ఫెస్ట్–2025 పేరిట 5కె మారథాన్ పరుగుపందెం పోటీలను శనివారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ పోటీల్లో 55 మంది యువకులు, 15 మంది యువతులు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు పాల్గొనగా..పురుషుల విభాగంలో ప్రథమ స్థానం ఆర్.మహేశ్వరరావు, ద్వితీయ స్థానం టి.దివాకర్, మహిళల విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలను సీహెచ్ భార్గవి, కె.తేజస్విని, ట్రాన్స్‌జెండర్లలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో జి.జగన్నాథం (మోక్ష), బి.వంశీకృష్ణ (సోనా) నిలిచారు. ప్రథమ బహుమతి పొందిన వారికి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేల నగదు పురస్కారాలను సోమవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ చేతుల మీదుగా అందజేయనున్నారని డీఎంహెచ్ఓ అనిత ప్రకటించారు.

హౌసింగ్ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న హౌసింగ్ సిబ్బంది

శ్రీకాకుళం కల్చరల్: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు నగరంలోని రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో శనివారం రక్తదానం చేశారు. దీనిలో భాగంగా 45 మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శిబిరాన్ని విశ్రాంత చీఫ్ ఇంజినీర్ పల్లి శ్రీరాములు, విశ్రాంత పీడీ నక్క గణపతి, ప్రాజెక్టు డైరెక్టర్ కొప్పుల అప్పారావులు ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, చైతన్యకుమార్, జి.రమణ, యువజన సర్వీసుల ముఖ్య కార్యనిర్వాహణాధికారి వీవీ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్ని దానాల్లోకి అన్నదానం మిన్న



అన్నదానంలో పాల్గొన్న సూర శ్రీనివాసరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అన్ని దానాల్లోకి అన్నదానం మిన్న అని ఎస్‌ఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని పాత బస్టాండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో భారీ అన్నదాన కార్యక్రమాల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ప్రతిఏటా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయడంతో పాటు పలు మండపాలు వద్ద అన్నదానం కార్యక్రమాల్లో భాగస్వామిని చేయడం ఎంతో సంతోషకరమన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి దైవ కార్యక్రమాలకు సహకరించేందుకు ముందుంటానని తెలియజేశారు. వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

గురుమూర్తికి కళా అవార్డు



రాష్ట్రస్థాయి కళా అవార్డును అందుకుంటున్న గురుమూర్తి

రణస్థలం: రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయ పరిషత్ పోటీల్లో రణస్థలం మండల కేంద్రానికి చెందిన బోనం గురుమూర్తి భక్తకవి నటికీరుడుగా, కుష్టు వ్యాధిగ్రస్థుడిగా నటించినందుకు గానూ రాష్ట్రస్థాయి అవార్డు లభించిందని ఆయన తెలిపారు. విజయవాడలో శుక్రవారం జరిగిన పోటీల్లో రాష్ట్రవ్యాప్తంగా 80 మంది కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక ప్రోత్సాహం అందించిన పిన్నింటి సాయి సురేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గంగమ్మ ఒడికి గణపయ్య

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గౌరీ పుత్రుడు గణపయ్య గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. భక్తులంతా గణపతి బప్పా మోరియా అంటూ భక్తిశ్రద్ధలతో ఏక దంతుడిని నిమజ్జనానికి తరలించారు. మేళ తాళాలు, డప్పుల దరువులు, డీజే పాటల మధ్య చిన్నా, పెద్ద ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నిమజ్జనం చేస్తున్న భక్తుడు



శ్రీకాకుళం కల్చరల్: బలగ బాలత్రిపుర కాలభైరవ ఆలయం వద్దనున్న నాగావళి నదిలో నిమజ్జనం



శ్రీకాకుళం కల్చరల్: తప్పెటగుళ్ల విన్యాసం చేస్తున్న కళాకారులు

ఈ–పాస్ ద్వారా యూరియా సరఫరా చేయాలి



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రణస్థలం: ఈ–పాస్ ద్వారా యూరియా సరఫరా చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని వెల్పురాయి గ్రామ సచివాలయాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు అధికంగా క్యూలైన్‌లో ఉంటే టోకెన్లు జారీ చేసి యూరియా సరఫరా చేయాలని సూచించారు. అలాగే ఒక రైతు ఎంత సాగు చేస్తున్నారు.. ఎంత యూరియా అవసరం ఉందో సక్రమంగా తెలుసుకోవాలన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం పరిధిలో ఉన్న రైతులకు మాత్రమే యూరియా ఇవ్వాలని ఆదేశించారు. తదుపరి పాతర్లపల్లి పీహెచ్‌సీని సందర్శించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో కె.అనిత, తహసీల్దార్ సనపల కిరణ్ కుమార్, ఏడీఏ వి.శ్రీనివాసరావు, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, పాతర్లపల్లి పీహెచ్‌సీ వైద్యులు కె.లక్ష్మీ సౌజన్య, బీవీపీ అనూష తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో సకాలంలో ఎరువులు



మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు సకాలంలో ఎరువులు అందేవని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్ అన్నారు. మండలంలోని ఆనందపురం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఒక్క యూరియా బస్తా కోసం రైతన్నలు నానా పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో ఎరువులు అందకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కంచరాన రమణారావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పేడాడ శ్యామలరావు, పేడాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణారావు

జి.సిగడాం:

గ్రామస్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం పరిరక్షణలో ప్రజలు, యువత భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటింటా సేకరించిన చెత్తను చెత్త కేంద్రాలకు తరలించాలన్నారు. అలాగే ఇంటి పన్నులు వసూలు చేయడంలో ఎటువంటి అలసత్వం వద్దన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో లక్ష్య ప్రియదర్శి



ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న సాందీప్‌శర్మ

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి ఆదిత్యాలయాన్ని ప్రముఖ క్వాంటమ్ టెక్నాలజీస్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్య ప్రియదర్శి, సీనియర్ ప్రొడక్ట్స్ లీడర్ చంద్రమౌళి తదితర బృందం శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ, ఇప్పిలి షణ్ముఖశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. వీరి వెంట టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ బుడుమూరు రాజేష్ తదితరులున్నారు.

'రేషన్ లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: రేషన్ లబ్ధిదారులతో డీలర్లు కుటుంబ సభ్యుల్లా మాట్లాడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జిల్లాలోని రేషన్, గ్యాస్ డీలర్లతో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆమోదం తెలిపిన ధరలకే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయాలని, ఐవీఆర్ఎస్ కాల్స్‌లో ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్ నాణ్యతపై సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్లు ఎప్పటికప్పుడు రేషన్ షాపుల్లో తనిఖీ చేయాలని ఆదేశించారు.

అక్టోబర్ 4,5 తేదీల్లో సీఐటీయూ జిల్లా మహాసభలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): అక్టోబర్ 4,5 తేదీల్లో సోంపేటలో జరిగే సీఐటీయూ శ్రీకాకుళం జిల్లా 12వ మహాసభలు జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా మహాసభలు సెప్టెంబరు 14న పాతపట్నంలో, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభలు సెప్టెంబరు 14 శ్రీకాకుళంలో, మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల యూనియన్ జిల్లా మహాసభలు సెప్టెంబరు 24న శ్రీకాకుళంలో జరుగుతాయని తెలిపారు. ఆటో, మ్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు భృతి కల్పించి వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ సెప్టెంబరు 11న శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద, టెక్కలి, పలాస ఆర్డీఓ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు.